

ఆందోళన బాటలో.. ఆరోగ్య మిత్రలు



- సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమ ఉధృతికి నిర్ణయం
- ఆరోగ్య మిత్రలందరినీ డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్‌గా గుర్తించాలని వినతి
- జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్
- గత సర్కారు నిర్వాకంపై మండిపాటు
- కొత్త సర్కారు పైనే కోటి ఆశలు

నిర్మల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన ఆరోగ్యశ్రీ పథకం అమలులో కీలకపాత్ర పోషిస్తున్న ఆరోగ్యమిత్రలు తమ సమస్యల సాధనకు ఆందోళన బాటకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 14లోగా తమ సమస్యలు పరిష్కరించనట్లయితే ఇక రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యమిత్రలంతా సమ్మెలో దిగేందుకు సిద్ధంగా ఉన్నారంటూ వారంతా స్పష్టం చేస్తున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఉన్నతాధికారులకు ఈ నెల 6న డిమాండ్‌లతో కూడిన సమ్మె నోటీసులను అందించారు. ప్రభుత్వం రాష్ట్రంలోని అన్నిశాఖల ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తున్నప్పటికీ ఆరోగ్యమిత్రలపైనా నిర్లక్ష్యం చేస్తుందంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, ఈ పథకంను నీరుగార్చే ప్రయత్నాలు కూడా చేపట్టిందంటూ వారు ఆరోపిస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకం లో అన్నీ తామై వ్యవహరిస్తున్న ఆరోగ్యమిత్రలపై మొదటి నుంచి నిర్లక్ష్యం కొనసాగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కరోనా సమయంలో ఆరోగ్యమిత్రలు అందించిన సేవలను సైతం ప్రభుత్వం ఇప్పటి వరకు ప్రత్యేకంగా గుర్తించకపోవడం పట్ల వారంతా మనోవేదన చెందుతున్నారు. 2007 సంవత్సరంలో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ పథకాన్ని పేద బడుగు బలహీన వర్గాలందరికీ ఉచిత వైద్య సేవలు అందించేందు కోసం ప్రారంభించారు. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన ప్రభుత్వాలు అంతగా పట్టించుకోకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులు ఈ పథకం కింద సేవలు అందించలేమంటూ చేతులేత్తేశాయి. ఆ తరువాత ప్రైవేటు ఆసుపత్రుల యజమానులతో చర్చలు జరిపిన సర్కారు వారిని ఒప్పించి ఈ పథకాన్ని కొనసాగించే విధంగా చర్యలు తీసుకున్నప్పటికీ ఆరోగ్యమిత్రల విషయంలో మాత్రం స్పందించకపోవడం అప్పట్లో విమర్శలకు తావిచ్చింది. అయితే ఆరోగ్యమిత్రులంతా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ఇక తమకు మంచి రోజులు వస్తాయని ఆశిం చారు. కాగా దాదాపు ఏడు నెలల నుంచి రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆరోగ్యమిత్రల సమస్యలపై దృష్టి సారించకపోవడంతో వారంతా ఆందోళనకు గురవుతున్నారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రస్తుతం ఆరోగ్య శ్రీ హెల్త్‌కేర్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. దీని కింద ఆరోగ్య శ్రీ పథకంతో పాటు ఆయుష్మాన్ భారత్, జర్నలిస్టు హెల్త్ స్కీం పథకాన్ని అనుబంధం చేశారు. హైదరాబాద్‌లోని కార్పోరేట్ ఆసుపత్రులను సైతం ఈ పథకం కింద సేవలు అందిస్తున్నాయి. అయితే ఆరోగ్య శ్రీ కార్యకర్తలను దాదాపు పదహారు సంవత్సరాల నుంచి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగానే కొనసాగిస్తున్నారు. తామందరిని డేటా ప్రాసెసింగ్ ఆఫీ సర్ కేడర్‌లోకి మార్చి జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ఉద్యోగులుగా కాకుండా ప్రభుత్వ ఉద్యోగులుగా తమను గుర్తించాలంటూ వారు డిమాండ్ చేస్తున్నారు. తామందరిని సీనియార్టీ ఆధారంగా పీహెచ్‌సీల్లో ఉద్యోగులుగా నియమించాలని వారు కోరుతున్నారు.

ఇక సమ్మె తప్పదంటున్న సంఘ నేతలు

ఇదిలా ఉండగా 2007 సంవత్సరం నుంచి తాము ఆరోగ్యమిత్రలుగా అరకొర జీతాలతో కొనసాగుతున్నామని తమ గోడును అప్పటి ప్రభుత్వమే కాకుండా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కూడా ప్రభుత్వం పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము చాలా సార్లు ప్రభుత్వానికి తమ సమస్యపై గోడు వెల్లబోసుకున్నప్పటికి పట్టించుకోకపోవడం పట్ల వారంతా ఆవేదనకు గురయ్యారు. అయితే గతంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చినప్పటికి ఆ హామీ నెరవేరలేదని అంటున్నారు. కాగా అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్న ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తమకు కూడా న్యాయం చేయాలంటూ వారంతా కోరుతున్నారు. అయితే ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నప్పటికి ఆరోగ్యశ్రీలో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలపై ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదని వారంతా వాపోతున్నారు. తాము అరకొర వేతనాలతో కరోనా లాంటి కష్ట సమయంలో కూడా ప్రాణాలకు తెగించి బాధ్యతయుతంగా విధులు నిర్వహించామని వందలాది మంది ప్రాణాలను కాపాడడంలో తాము కృషి చేశామంటూ వారు పేర్కొంటున్నారు. అయితే ప్రభుత్వం స్పందించకపోతుండడంతో ఇక సమ్మెబాటకు వారంతా సిద్ధమవుతున్నట్లు ప్రకటిస్తున్నారు. ఇందు లో భాగంగానే సంఘ రాష్ట్ర నేతలు ఈ నెల 6వ తేదీన సమ్మెకు సంబంధించిన నోటీసును ఉన్నతాధికారులకు అందించారు. ఆగస్టు 20లోగా తమ సమస్యలను పరిష్కరించకుంటే ఇక సమ్మెకు దిగేందుకు వారంతా సిద్ధమవుతున్నారు.

కొత్త సర్కారుపైనే కోటి ఆశలు

ఇదిలా ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికార బాధ్యతలు స్వీకరించగానే అన్ని ప్రభుత్వశాఖలకు సంబంధించిన ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించడమే కాకుండా వారికి అందాల్సిన అన్ని ప్రయోజనాలు దక్కేట్లు చర్యలు తీసుకుంటోంది. దీంతో ఆరోగ్యమిత్రలు సైతం తమ సమస్యలను సర్కారు దృష్టికి ఇప్పటికే పలుసార్లు తీసుకొని వెళ్లారు. ప్రభుత్వం తమకు స్పష్టమైన హామీనిస్తుందని వారంతా భావించారు. జీఓనంబర్ 60 ప్రకారం తమ వేతనాలను 22,750లకు పెంచాలని అలాగే ఇతర అన్ని రకాల ప్రయోజనాలను కల్పించాలని వారు కోరుతున్నారు. ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారం విషయంలో ఇలాగే నిర్లక్ష్యం కొనసాగిస్తే ఇక సమ్మె తప్పందంటున్నారు. వేతన పెంపుదలతో పాటు ఆరోగ్యమిత్రలందరికీ డాటా ప్రాసెసింగ్ కేడర్ కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఆరోగ్యమిత్రల జీతాలన్ని ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా కాకుండా నేరుగా ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా అందించాలని, కాంట్రాక్ట్ విధానంను మార్చాలని కోరుతున్నారు. రాబోయే పీఆర్‌సీలో కనీస వేతనం 35వేలతో పాటు టీఎ, డీఏ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. షఫ్లింగ్ విధానంను రద్దు చేయాలంటున్నారు.

16 ఏళ్లుగా పని చేస్తున్నాం.. డాటా ఎంట్రీ ఆపరేటర్ హోదా ఇవ్వండి

జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో గత 16 ఏళ్ల నుంచి ఆరోగ్య మిత్రలుగా పనిచేస్తున్నాం. ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ప్రభుత్వం తమను నియమించగా, కేవలం 13,500 వేతనం మాత్రమే వస్తోంది. పారిశుద్ధ్య కార్మికుల కంటే అధ్వాన్నంగా మా పరిస్థితి తయారైంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కనీసం డాటా ఎంట్రీ ఆపరేటర్ హోదాను కల్పించి, కనీస వేతనాన్ని అందజేయాలి.

- స్వప్న, ఆరోగ్యశ్రీ సంఘం జిల్లా అధ్యక్షురాలు, నిర్మల్

అడెల్లి మహాపోచ్చమ్మను దర్శించుకున్న కూచాడి



అడెల్లి ఆలయంలో పూజలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు

సారంగాపూర్, ఆగస్టు 9 : మండలంలో గల అడెల్లి మహాపోచమ్మ ఆలయంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు మొక్కులను మొక్కి ప్రత్యేకపూజలు చేశారు. ఈ నేపథ్యంలో ఆలయ పూజారి అమ్మవారికి హారతినిచ్చి తీర్థప్రసాదాలను అందజేశారు.

స్వర్ణప్రాజెక్టు సందర్శన

మండలంలో గల స్వర్ణ ప్రాజెక్టును కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు సందర్శించి ప్రాజెక్టు అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇటీవల అనారోగ్యం బారిన పడిన బాధిత కుటుంబాలను పరామర్శించి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట నాయకులు రాజ్ మహ్మద్, అట్ల మహిపాల్‌రెడ్డి, మాధవ్‌రావు, బి. నర్సయ్య, ఆది, సలీమ్, విలాస్ రావు, రాజు, వెంకట్ , రమణారెడ్డి, సత్యపాల్ రెడ్డిలతో పాటు నాయకులు ఉన్నారు.

బాధితుడికి పరామర్శ

నిర్మల్ టౌన్, ఆగస్టు 9 : నిర్మల్ పట్టణంలోని తేజ ఆసుపత్రిలో ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్సలు పొందుతున్న సారంగాపూర్ మండలం కౌట్ల(కే) గ్రామానికి చెందిన భోజన్న అనే వ్యక్తిని డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు శుక్రవారం పరామర్శించారు.

ప్రతీ ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలి

- ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ సత్యం



ఖానాపూర్‌లో మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్మన్ సత్యం

ఖానాపూర్, ఆగస్టు 9 : నేటి సమాజంలో పెరుగుతున్న కాలుష్యం బారి నుంచి పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతీఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్మన్ సత్యం అన్నారు. శుక్రవారం స్వచ్ఛదనం - పచ్చదనం ముగింపు కార్యక్రమంలో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక విద్యానగర్ నుండి అర్బన్ పార్క్ వరకు విద్యార్థులు, అటవీశాఖ అధికారులు, మెప్మా, మున్సిపల్ సిబ్బందితో కలిసి నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం అర్బన్ పార్క్ వద్ద పలు రకాల పండ్ల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో కిరణ్‌కుమార్, ఎఫ్ఎస్‌వో రవీందర్, మహేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, ఖానాపూర్ ఎస్సై లింబాద్రి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, కౌన్సిలర్ కుర్మ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు అమానుల్లాఖాన్, తూము చరణ్, తదితరులున్నారు.

గుండంపల్లిలో ఆరోగ్య వైద్య శిబిరం

దిలావర్‌పూర్, ఆగస్టు 9 : మండలంలోని గుండంపల్లిలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య సిబ్బంది గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ సర్వే చేసి జ్వర పీడితులను శిబిరానికి తరలించారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 9 : నిర్మల్‌లోని విశ్వనాథ్‌పేట్‌లోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శుక్రవారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రత్యేకపూజలు చేశారు. నాగపంచమి సందర్భంగా స్వామిని దర్శించుకున్నారు. నాయకులు రావుల రాంనాథ్ ఆయన వెంట ఉన్నారు.

'ఆశాలను దూషించిన సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోవాలి'

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 9 : బెల్లంపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆశా వర్కర్లను దూషించిన సూపర్‌వైజర్ మధుపై చర్య తీసుకోవాలని జిల్లా ఆశా వర్కర్ల సంఘం అధ్యక్షురాలు బి. సుజాత డిమాండ్ చేశారు. అధికారుల వేధింపుకు నిరసనగా సమావేశం నిర్వహించారు. అధికారుల వేధింపుల కారణంగా మనోవేదనకు గురవుతున్నారన్నారు. ఆశా నాయకులు చంద్రకళ, గంగామణి, ఇంద్రమాల, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

భైంసా రూరల్, ఆగస్టు 9 : జూన్ 6న జరిగిన రెండు దొంగతనాల సంఘటనలో ఒకరిని అరెస్టు చేశామని జరిగిన భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితుడు సుంకరి వినయ్‌కుమార్ ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి జూన్ 6న వెళ్లగా, అదే రోజు రాత్రి ముగ్గురు వ్యక్తులు మహారాష్ట్ర నుంచి ఒక మోటార్ సైకిల్‌పై ఇంటితాళం పగలగొట్టి ఇంటిలోకి ప్రవేశించారు. బీరువా పగలగొట్టి అందులో ఉన్న 17.5 గ్రాముల బంగారం, 7 తులాల వెండి, ఒక ఫోన్, టీవీ, రూ. 15,000ల నగదును దొంగిలించారు. వాటి మొత్తం విలువ 2,10,000 ఉంటుందన్నారు. అదేరోజు నేతాజీనగర్‌లో తాళం వేసి ఉన్న బాబొల్ల రమేష్ ఇంటిలో ప్రవేశించి బీరువా తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న 5 తులాల బంగారు ఆభరణాలు, 30,000ల నగదు, రెండు గల్లపెట్టెలను దొంగిలించారు. వాటి మొత్తం విలువ రూ. 75,000 ఉంటుంది. నేరస్తుడైన కౌలెకర్ రాజును సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో పట్టుకుని అతని వద్ద నుండి రూ. 10,000, ఒక మొబైల్ ఫోన్ రికవరీ చేసిన తర్వాత అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచామన్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని, త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ రాజారెడ్డి, భైంసా టౌన్ ఎస్సై ఎండీ షరీఫ్, పోలీసు బృందాన్ని అభినందించారు.

బియ్యం నమూనాల సేకరణ

నర్సాపూర్(జి), ఆగస్టు 9 : మండలంలోని చాక్‌పల్లి గ్రామంలోని చౌకధరల దుకాణంలో శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రామాదేవి రేషన్ బియ్యం నమూనాలు సేకరించారు. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త సయ్యద్ కలీం ప్రభుత్వం అందించే రేషన్ బియ్యం నాణ్యతగా లేవని జిల్లా పౌరసరఫరాల శాఖా అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. అధికారులు స్పందించకపోవడంతో సామాజిక మాధ్యమంలో ఎక్స్‌లో తెలంగాణా రాష్ట్ర మంత్రులకు, అధికారులకు పోస్టు చేశాడు. చాక్‌పల్లి గ్రామంలోని చౌకధరల దుకాణంలో శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రమాదేవి బియ్యం నమూనాలు సేకరించారు. బియ్యం భైంసా ఎంఎల్ఎస్ పాయింట్ నుండి సరఫరా అయినట్లు తెలిపారు. బియ్యం సరఫరా చేసిన రైస్ మిల్లులను గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అధికారుల పర్యవేక్షణలోపం వల్లే ప్రజలకు ఇబ్బందులు

అధికారులు పర్యవేక్షణలోపం వల్లే మండలంలోని చౌకధరల దుకాణాల్లో నాణ్యతలేని బియ్యం సరఫరా చేస్తున్నా ప్రజలు సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకుపోలేదు. సామాజిక కార్యకర్త సామాజిక మాధ్యమంలో పోస్టు చేయడంతో మండలంలో ప్రతీ ఒక్క చౌకధరల దుకాణంలో నాణ్యతలేని రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నా అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

స్వాతంత్ర్య దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు చేయండి

- కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశం



ఏర్పాట్లపై ఆదేశాలిస్తున్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 9 : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించేందుకు ఎన్టీఆర్ మినీస్టేడియంలో ఘనంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమావేశ మందిరంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశభక్తి ప్రతిబింబించేలా పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, పోలీసుపరేడ్ నిర్వహించేలా చూడాలన్నారు. జిల్లాలోని స్వాతంత్ర్య సమరయోధులను, ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. సీనియర్ సిటిజన్లు, మీడియా ప్రతినిధులకు, ఫొటోగ్రాఫర్లకు ప్రొటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు ఉండాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లు ఏర్పాటు చేయాలని, శకటాల ప్రదర్శన చేయాలన్నారు. అంబులెన్స్, వైద్యసిబ్బంది వేదిక వద్ద అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా తాగునీరు, టెంట్, కుర్చీలు తదితర సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు విజయవంతం చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, డీఆర్‌వో భుజంగరావు, భైంసా ఆర్డీవో కోమలరెడ్డి, డీఎస్పీ గంగారెడ్డి, జిల్లా వైద్యాధికారి రాజేందర్, సీపీవో బాబురావు, తదితర అధికారులు పాల్గొన్నారు.



పాఠశాలలో మొక్కలు నాటుతున్న కలెక్టర్

చెట్లను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది కలెక్టర్ అభిలాష అభినవ్

సారంగాపూర్, ఆగస్టు 8 : చెట్లను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ధనిలో గల ప్రభుత్వ పాఠశాలలో హరితవనంలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలను నాటి ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పర్యావరణాన్ని కాపాడడంతో పాటు చెట్లను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గ్రామాల్లో మొక్కల ప్రాముఖ్యతను వివరిస్తూ వాటి వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేయాలని అధికారులతో పేర్కొన్నారు. మానవ మనుగడకు చెట్లు కీలకమని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటి పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎస్సీ డిక్లరేషన్ అమలు చేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

దిలావర్‌పూర్, ఆగస్టు 9 : చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎస్సీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. ప్రతి దళిత కుటుంబానికి అంబేద్కర్ అభయ హస్తం కింద రూ. 12 లక్షలు, ఇళ్లు లేని దళిత కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయం, ఎస్సీ ఉప కులాలకు సంవత్సరానికి రూ. 750 కోట్లు కేటాయించాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా యువతకు సంవత్సరానికి రూ. 1000 కోట్లు కేటాయించి వెంటనే అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు దిలావర్‌పూర్ తహసీల్దార్‌కు బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు పి. శైలేశ్వర్, జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు ఉంగరాల రాజుల ఆధ్వర్యంలో కార్యకర్తలు వినతి పత్రం అందజేశారు.

13న మస్కాపూర్‌లో జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

ఖానాపూర్, ఆగస్టు 9 : జిల్లా స్థాయి అండర్-17 వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ఈ నెల 13వ తేదీన ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ గ్రామంలో నిర్వహించనున్నట్లు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు సోయాబ్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి షేక్ ఇమ్రాన్‌లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం వారు ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మల్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు బోనఫైడ్, రెండు ఫోటోలు, ఆధార్ కార్డుతో ఉదయం 10 గంటలకు మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు హాజరు కావాలని వారు కోరారు. పూర్తి వివరాలకు 9963168632 నెంబర్‌పై సంప్రదించాల్సిందిగా సూచించారు.

ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా కళ్లకు గంతలు కట్టుకుని నిరసన

దిలావర్‌పూర్, ఆగస్టు 9 : ఇథనాల్ పరిశ్రమ నిర్మాణానికి వ్యతిరేకంగా దిలావర్‌పూర్ గ్రామస్థులు చేస్తున్న రిలేనిరాహార దీక్షలు శుక్రవారం నాటిని 17వ రోజుకు చేరాయి. గ్రామస్తులు కళ్లకు నల్లని గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో గ్రామంలోని కుల సంఘాలు, యువజన సంఘాలు, రైతులు పాల్గొన్నారు. ఎన్నికలకు ముందు ఇథనాల్ పరిశ్రమను అడ్డుకుంటామని ప్రగల్భాలు పలికిన నాయకులు ఇప్పుడు ఎక్కడికి పోయారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా చిత్త శుద్ధితో ఇథనాల్ పరిశ్రమ వ్యతిరేక ఉద్యమంలో పాలుపంచుకోవాలని డిమాండ్ చేశారు.

రైతులకు కూరగాయల విత్తనాలు పంపిణీ

పెంబి, ఆగస్టు 9 : మండలంలోని లోతర్య గ్రామంలో రైతులకు సీఆర్‌డీ సంస్థ ఆధ్వర్యంలో 14 రకాల కూరగాయల విత్తనాలను శుక్రవారం సీఆర్‌డీ ప్రతినిధి శ్రీకాంత్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సీఆర్‌డీ సంస్థ ఆధ్వర్యంలో 14 రకాల కూరగాయల విత్తనాలను రైతులకు అందజేయడం జరిగిందని, వీటిని ఇంటి దగ్గర వేసుకొని కిచెన్‌గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ భీంరావు, నీతి అయోగ్ అధికారి నవీన్, మహిళలు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం.. పచ్చదనంలో పాల్గొన్న ఉద్యోగులు

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 9 : నీటి పారుదల శాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు. పరిసరాలు శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలు తొలగించారు. జిల్లా ఇంజనీరింగ్ అధికారులు లక్ష్మీ, టీఎస్జీవో అధ్యక్షుడు ప్రభాకర్, డీఈఈ శ్రీనివాస్ రావు, వెంకటేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 9 : ఆదర్శనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 10 నుంచి 12 వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. రాంనగర్, గాయత్రిపురం, ఆస్రాకాలనీ, ఈద్గామ్, భాగ్యనగర్, చేపల మార్కెట్, సిద్ధాపూర్, ఇందిరమ్మ కాలనీ, సోఫీనగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదు.

దివ్యనగర్‌లో... దివ్యనగర్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఏఎన్ రెడ్డి, శ్రీనగర్, శాంతినగర్, శాస్త్రినగర్, దత్తాత్రేయనగర్, ఖురాన్‌పేట్, ఫైకసాబ్‌పేట్, ఇస్లాంపూర్, సోమవార్‌పేట్, బుధవార్‌పేట్, గుల్జార్ మార్కెట్ ప్రాంతాల్లో సరఫరా నిలిచిపోనుంది.

దిలావర్‌పూర్ : మండలంలోని గుండంపల్లి ఎక్స్‌రోడ్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు గుండంపల్లి, సముందర్‌పల్లి, రత్నాపూర్ కాండ్లీ, టెంబుర్ని, చర్లపల్లి, ధర్యాపూర్, రాంపూర్, నసీరాబాద్ గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పెంబిలో..

పెంబి, ఆగస్టు 9 : పెంబి మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతు పనులు, పెరిగిన చెట్ల తొలగింపు పనులు జరుగుతున్న దృష్ట్యా శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

టౌన్ సబ్‌స్టేషన్‌కు మరమ్మతులు

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 9 : విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి 11 వరకు సరఫరాలో అంతరాయం ఉంటుంది. పాత బస్టాండ్, మార్కెట్, ఏరియా ఆసుపత్రి, ప్రియదర్శిని నగర్, సాగర్‌కాలనీ, బర్కత్‌పురా, బాగులవాడ, చింతకుంటవాడ, శిశుమందిర్, గాజులపేట్, మెటర్నిటీ ఆసుపత్రి, ఆర్డీవో, కలెక్టర్ క్యాంపు, ఎస్పీక్యాంపు, అటవీ శాఖ, గొల్లపేట్, చైన్‌గేట్, ఇందిరానగర్, భాగ్యనగర్, విజయనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదు.

‘గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి’

తలమడుగు, ఆగస్టు 9 : గత 20 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పలు అంటు వ్యాధులు సోకే అవకాశమున్నందున ముందస్తుగా ప్రతీ గ్రామంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. ఉమ్రిలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్యసిబ్బందిని సంప్రదించాలని కోరారు.

అకడమిక్ డీఎంఈ రాజీనామా!

- ఆ పోస్టు తనకొద్దంటూ సర్కారుకు శివరాంప్రసాద్ లేఖ
- కొత్త వైద్య కళాశాలలకు అనుమతులు తేవాల్సిందేనని ఉన్నతాధికారుల ఒత్తిడి!
- అది భరించలేకనే తప్పుకొన్న శివరాం?

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడు డాక్టర్ శివరాంప్రసాద్ తన పదవికి రాజీనామా చేశారు. తనను ఆ పోస్టు నుంచి తప్పించాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశారు. తాను అకడమిక్ డీఎంఈగా విధులు నిర్వహించలేని పరిస్థితుల్లో ఉన్నానని లేఖలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. వైద్యవిద్య సంచాలకుల పరిధిలో జరిగిన సాధారణ బదిలీల కంటే ముందే ఆయన సర్కారుకు రాజీనామా లేఖను పంపినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత కొద్ది రోజులుగా ఆయన డీఎంఈ కార్యాలయానికి కూడా రావడం లేదు. వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడిగా తీవ్రమైన పనిభారం, ఉన్నతాధికారుల ఒత్తిడి తట్టుకోలేకనే ఆ పోస్టు నుంచి తప్పుకొన్నారని శివరాంప్రసాద్ సన్నిహితులు చెబుతున్నారు. ప్రస్తుతం కొత్తగా 8 వైద్య కళాశాలల్లో ఈ ఏడాది నుంచి ప్రవేశాలను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. కానీ, అధ్యాపకులు, సౌకర్యాల లేమి కారణంగా 8 కాలేజీలకు జాతీయ వైద్య మండలి అనుమతి ఇవ్వలేదు. దీనిపై డీఎంఈ కార్యాలయం అప్పీలుకు వెళ్లగా.. నాలుగింటికి అనుమతులు వచ్చాయి. మరో నాలుగు పెండింగ్‌లో ఉన్నాయి. ఎలాగైనా సరే వాటికి అనుమతులు తీసుకురావాల్సిందేనని ఉన్నతాధికారులు డీఎంఈ కార్యాలయంపై ఒత్తిడి తీసుకొచ్చారు. అది భరించలేకనే ఆయన అకడమిక్ డీఎంఈ పదవి నుంచి వైదొలగినట్లు తెలుస్తోంది.

ప్రాణం తీసిన ఇన్‌స్టా స్నేహం

- ప్రేమ పేరిట యువకుడి వేధింపులు.. బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య


తేజస్విని (ఫైల్)

గుమ్మడిదల, ఆగస్టు 9: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తితో చేసిన స్నేహం ఓ యువతి ప్రాణాలు తీసింది. ప్రేమ పేరుతో ఆ యువకుడి వేధింపులు భరించలేక ఓ బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. తమ ఇంటి భవనంపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడింది. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దోమడుగు గ్రామానికి చెందిన రాజు, సోనీ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె తేజస్విని(20) ఉన్నారు. బీఫార్మసీ సెకండియర్ చదువుతున్న తేజస్వినికి అదే గ్రామానికి చెందిన శ్రీహరి కొద్ది రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. కొద్ది రోజుల తర్వాత తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని శ్రీహరి వేధించడం మొదలుపెట్టాడు. ఇదే విషయమై తేజస్విని కుటుంబసభ్యులను కూడా బెదిరించాడు. దీంతో తేజస్విని ఇంట్లో నాలుగు రోజుల క్రితం కూడా గొడవ జరిగింది. ఈ క్రమంలో శ్రీహరి వేధింపులు తాళలేకపోయిన తేజస్విని గురువారం రాత్రి తమ ఇంటి భవనం మూడో అంతస్తు నుంచి దూకేసింది. రక్తపుమడుగులో పడి ఉన్న తేజస్వినిని కుటుంబసభ్యులు హుటాహుటిన సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా అక్కడ మరణించింది.

పీర్జాదిగూడ కార్పొరేషన్ హస్తగతం

పీర్జాదిగూడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఖాతాలోకి మరో మునిసిపల్ కార్పొరేషన్ చేరింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డిపై కాంగ్రెస్ కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం నగర పాలక మండలి సమావేశం జరిగింది. మొత్తం 26 మంది కార్పొరేటర్లు ఉండగా.. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 21 మంది ఓటు వేశారు. దీంతో మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లుగా ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు. త్వరలోనే మేయర్ ఎన్నికకు తేదీ ఖరారు అయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్‌లో ఇప్పటి వరకు కొనసాగిన అరాచక పాలనకు తెరపడిందని అన్నారు. కాంగ్రెస్‌కు చెందిన 12వ డివిజన్ కార్పొరేటర్ అమర్‌సింగ్‌ను తమ మేయర్ అభ్యర్థిగా ప్రకటించారు.

పెద్దాపూర్ గురుకులంలో విద్యార్థి మృతి

- అర్ధరాత్రి ఇద్దరు విద్యార్థులకు అస్వస్థత
- తెల్లవారుజామున ఆస్పత్రికి తరలింపు
- ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- టీచర్ల నిర్లక్ష్యమేనని బంధువుల ఆరోపణ

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 9: అర్ధరాత్రి అస్వస్థతకు గురైన ఇద్దరు గురుకుల విద్యార్థులను తెల్లవారుజామున ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి ఒకరు మృతి చెందగా.. మరొకరు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఎలమాడల అనిరుధ్ (11), జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన మొండి మోక్షిత్ గురుకులంలో ఆరోతరగతి చదువుతున్నారు. వీరిద్దరూ గురువారం రాత్రి తోటి విద్యార్థులతో కలిసి నిద్రపోయారు. అయితే అర్ధరాత్రి సమయంలో అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఉదయం 5.30 గంటల సమయంలో పీఈటీ వెళ్లగా.. కడుపు నొప్పిగా ఉందని అనిరుధ్, మోక్షిత్‌లు తెలిపారు. దీంతో వెంటనే కేర్‌టేకర్‌లు, అనిరుధ్ తల్లికి ఫోన్‌లో సమాచారం ఇచ్చి వారిని కోరుట్ల ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అనంతరం విషమంగా ఉందని తెలపడంతో వెంటనే జిల్లా కేంద్రంలోని ఆస్పతికి తీసుకెళ్లారు. అప్పటికే విషయం తెలిసి వైద్యుడు కూడా అయిన కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్.. విద్యార్థులు పాము కాటుకు గురై ఉండవచ్చని అందుకు తగిన వైద్యం చేయాలని ఆర్మూర్‌లో వైద్యులకు సూచించారు. అక్కడ వైద్యం అందించి నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అనిరుధ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మోక్షిత్ పరిస్థితి కూడా విషమంగా ఉండడంతో చికిత్స అందిస్తున్నారు. ఇటు పాఠశాలలో ప్రార్థనా సమయంలోనే ఆరో తరగతి చదువుతున్న హేమంత్ అనే మరో విద్యార్థి కూడా కళ్లు తిరుగుతున్నాయని కింద పడిపోయాడు. గమనించిన ఉపాధ్యాయులు మెట్‌పల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాగా, 2 వారాల క్రితం ముగ్గురు విద్యార్థులు ఇదే విధంగా అస్వస్థతకు గురయ్యారు. వీరిలో చికిత్స అనంతరం ఇద్దరు కోలుకోగా.. 8వ తరగతి చదివే ఆర్.గణాధిత్య (13) మృతి చెందాడు. అయితే వీరు పాము కాటుకు గురైనట్లు సమాచారం.


అనిరుధ్ (ఫైల్)

ఎమ్మెల్యే సంజయ్ ఆగ్రహం..

విద్యార్థి అనిరుధ్ మృతి విషయం తెలిసి కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ గురుకులానికి చేరుకున్నారు. విద్యార్థి మృతికి కారణాలేంటని అక్కడి ఉపాధ్యాయులు ప్రశ్నించారు. అయితే తమకేం తెలియదని వారు సమాధానం చెప్పడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, విద్యార్థుల వరుస మరణాలకు ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో వసతులు సరిగా లేవని.. తమ పిల్లల భద్రత మాటేంటని అధికారులను ప్రశ్నిస్తున్నారు.

పూడికతీతతో పూర్వస్థితి

ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడిక తీయాలి

- వచ్చే ఇసుకతో ప్రభుత్వానికి ఆదాయం
- మట్టిని రైతులకు ఉచితంగా ఇవ్వాలి
- 14లోగా ప్రతిపాదనలు అందించాలి
- మంత్రివర్గ ఉపసంఘం ఆదేశం


ప్రాజెక్టుల్లో పూడికతీతపై సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడికతీత పనులు చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. ప్రాజెక్టుల రక్షణలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ ఉండరాదని స్పష్టం చేసింది. ప్రాజెక్టులకు ఏటా వచ్చే భారీ వరదతోపాటు పూడిక కూడా వచ్చి చేరుతోందని తెలిపింది. దీంతో ప్రాజెక్టుల సామర్థ్యం తగ్గుతున్నందున.. పూడికతీతతో పూర్వస్థితిని పునరుద్ధరించాలని సూచించింది. శుక్రవారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఉపసంఘం సమావేశం జరిగింది. పూడికతీతకు ఏయే చర్యలు తీసుకోవచ్చనే దానిపై నీటిపారుదల, మైనింగ్ శాఖలు సమగ్ర నివేదిక రూపొందించి, 14లోగా అందించాలని మంత్రివర్గం ఆదేశించింది. పూడిక వల్ల డ్యామ్ సేఫ్టీ సమస్యలు తలెత్తడంతో పాటు ఆయకట్టు తగ్గిపోతోందని, తాగునీటి అవసరాలపైనా దీని ప్రభావం పడుతుందని మంత్రులు పేర్కొన్నారు. ప్రాజెక్టుల్లో పూడికతీతకు పర్యావరణ అనుమతి అవసరంలేదని కేంద్రం చెప్పినందున..దానికనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. పూడికలో ఇసుక ఉంటే నిర్మాణ అవసరాలకు వినియోగించుకోవాలని, సారవంతమైన మట్టి ఉంటే రైతాంగానికి ఉచితంగా అందించాలని సూచించారు. పూడికను రైతులే స్వయంగా తీసుకెళ్లేలా విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు.

35 టీఎంసీల నిల్వను కోల్పోయాయి!

మహారాష్ట్ర, రాజస్థాన్‌లో వాణిజ్య అవసరాలకు ప్రయోగాత్మకంగా కొన్ని ప్రాజెక్టుల్లోని పూడికను వినియోగించుకుంటున్నారని అధికారులు మంత్రివర్గ ఉపసంఘానికి తెలిపారు. యంత్రాల సహాయంతో డ్రెడ్జింగ్ చేస్తూ పూడిక తీస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ హైడ్రాలజీ ప్రాజెక్టు (ఎన్‌హెచ్‌పీ) కింద 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు 35 టీఎంసీల నిల్వను కోల్పోయినట్లు తేలిందని నివేదించారు. ఏటా పూడిక తీతకు టెండర్లు పిలిచి ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగిస్తే.. ఇసుక తరలింపుతో ట్యాక్స్, సెస్, జీఎస్టీ, ఇతర రాయల్టీలతో ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని అన్నారు. పూడిక వల్ల జలాశయాలు ఏటా 0-5 శాతం నిల్వలను కోల్పోతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 25 ఏళ్లకు పైగా నిండిన జలాశయాలున్నాయని, ప్రయోగాత్మకంగా కొన్నింట్లో పూడికతీత చేపట్టి.. ఆ తరువాత మొత్తం 159 జలాశయాల్లో అమలు చేస్తే ప్రయోజనం ఉంటుందని వివరించారు. సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను మింగుతున్న పూడిక

ఏటా వరదల సమయంలో జలాశయాల్లోకి నీటితోపాటు పూడిక వచ్చిచేరుతుండడంతో ప్రాజెక్టుల సామర్థ్యం ఏయేటికాయేడు తగ్గిపోతోంది. ఈ పూడిక.. ప్రాజెక్టుల ఆయుష్షును కూడా తగ్గిస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నిజాంసాగర్‌ను 1923లో అప్పటి నిజాం ప్రభుత్వం నిర్మించగా... ఈ ప్రాజెక్టు 1967 నాటికీ 52.10 శాతం సామర్థ్యం కోల్పోయింది. అప్పట్లో నిజాంసాగర్‌కు ఎగువన ప్రాజెక్టులే లేకపోవడంతో వచ్చే వరద పూడికతో సహా జలాశయంలో చేరడంతో ప్రాజెక్టు సామర్థ్యం సగానికి పైగా తగ్గింది. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2016లో నిర్మించిన ర్యాలివాగు సామర్థ్యం 43.30 శాతం మేర తగ్గింది. శ్రీశైలం ప్రాజెక్టు 1976లో అందుబాటులోకి రాగా... 45 ఏళ్లలో పూడిక కారణంగా 29.96 శాతం మేర నీటినిల్వ సామర్థ్యం కోల్పోయింది. ఇక నాగార్జునసాగర్ 23.52 శాతం నిల్వ సామర్థ్యం తగ్గింది. మొత్తంగా రాష్ట్రంలో 929 టీఎంసీల సామర్థ్యం కలిగిన 159 భారీ రిజర్వాయర్లు ఉండగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించారు. ఇందులో ఈ ప్రాజెక్టుల సామర్థ్యం 35 టీఎంసీల మేర కోల్పోయిందని గుర్తించారు. ప్రాజెక్టుల్లో పూడిక చేరకుండా చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, నదీ తీర ప్రాంతాలు కోతకు గురికాకుండా మొక్కల పెంపకం వంటి చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ నిపుణులు సూచిస్తున్నా.. ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో వాటిని పూడిక మింగుతోంది. ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన(పీఎంకేఎస్‌వై) మార్గదర్శకాల ప్రకారం ఒక టీఎంసీ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ నిర్మించాలంటే భూసేకరణ, నిర్మాణ ఖర్చులు కలిపి రూ.162 కోట్లు అవుతాయని లెక్క ఉంది. ఈ లెక్కన రాష్ట్రంలో ఎన్‌హెచ్‌పీ కింద అధ్యయనం చేసిన జలాశయాలు రూ.5670 కోట్ల మేర నష్టపోయాయి.

నిర్మల్ వాసి ఆడు జీవితం

- సౌదీలో ఒంటెల కాపరిగా నామ్‌దేవ్
- రక్షించాలంటూ సెల్ఫీ వీడియో
- టీజీఎండీసీ చైర్మన్ అనిల్ ట్వీట్‌తో భారత ఎంబసీ స్పందన
- నామ్‌దేవ్ ఆచూకీ గుర్తించిన అధికారులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

దళారుల మాటలు నమ్మి భారత్ నుంచి సౌదీ అరేబియా వెళ్లి ఎడారిలో ఒంటెల కాపరిగా పని చేసే ఓ వ్యక్తి దుర్భర జీవితం ఇతివృత్తంగా ఇటీవల ఆడు జీవితం అనే సినిమా వచ్చింది. తెలంగాణలోని నిర్మల్ జిల్లాకు చెందిన రాథోడ్ నామ్‌దేవ్(51) అనే వ్యక్తి ఆ సినిమాలో మాదిరిగా సౌదీ ఎడారిలో దుర్భర జీవితం గడుపుతున్నాడు. ఈ కష్టాల నుంచి రక్షించండి అని వేడుకుంటూ నామ్‌దేవ్ ఇటీవల సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో పెట్టడంతో ఈ విషయం బయటికొచ్చింది. నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు స్పందన రావడంతో అతను స్వదేశానికి వచ్చే అవకాశం కనిపిస్తోంది. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎండీసీ) చైర్మన్ ఈరవత్రి అనిల్ స్పందించారు. నామ్‌దేవ్‌ను సురక్షితంగా స్వదేశానికి చేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి, కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులను ఎక్స్(ట్విటర్) ద్వారా కోరారు. దీంతో కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులు నామ్‌దేవ్‌ను సంప్రదించారు. కువైత్ సరిహద్దులోని సౌదీ అరేబియా ఎడారిలో నామ్‌దేవ్ ఉన్నట్టు గుర్తించారు. చాలా కాలంగా గల్ఫ్‌లో ఉంటున్న నామ్‌దేవ్‌ను అతని యజమాని పది నెలల క్రితం సౌదీలోని ఒంటెల క్షేత్రానికి తరలించినట్టు తెలిసింది. కాగా, సౌదీ, కువైత్‌లోని ప్రవాసీయులు నామ్‌దేవ్‌ను సంప్రదించేందుకు యత్నించగా అతని ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. నామ్ దేవ్‌ను ఏ విధంగా స్వదేశానికి పంపిస్తారో తెలియాల్సి ఉంది.

నిర్మల్ జిల్లాలో భక్తిశ్రద్ధలతో నాగులపంచమి


హరిహర క్షేత్రంలో నాగదేవతకు పూజలు చేస్తున్న భక్తులు


భైంసాలోని బాగుబాయి గుట్టపై నాగదేవునికి పూజలు చేస్తున్న మహిళలు

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 9 : నాగుల పంచమి పర్వదినం శుక్రవారం స్థానిక హరిహర క్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. నూతనంగా ప్రతిష్ఠించిన నాగుల విగ్రహానికి భక్తులు అభిషేకం నిర్వహించారు. స్వయంగా వెలసిన పుట్టలో పాలుపోసి నాగదేవతని పూజించారు. ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోదమ్మ, మురళీధర్‌రెడ్డి దంపతులతో పాటు గురువారం స్వామి మూర్తి, కోశాధికారి సామల వేణుగోపాల్ రెడ్డి భక్తులకు ఏర్పాట్లు చేశారు.

నాగమ్మ దేవాలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే రాంరావ్ పటేల్

భైంసా రూరల్, ఆగస్టు : 9 మండలంలోని సుంక్లీ గ్రామంలో శుక్రవారం నాగులపంచమి సందర్భంగా నాగమ్మ దేవాలయాన్ని ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులను ఎమ్మెల్యేకు ఆహ్వానం పలికారు. అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు పరమశివుడి ఆశీస్సులతో సకాలంలో వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు పండాలని, ప్రజలు సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో సంతోషంగా వర్ధిల్లాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి) : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో శుక్రవారం నాగులపంచమి వేడుకలను మహిళలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఉపవాస దీక్షలను ఆచరించారు. గ్రామ సమీపంలోని పుట్టల వద్దకు వెళ్లి పుట్టలో పాలు పోసి నాగదేవతకు మొక్కులు చెల్లించారు. పూలు, పండ్లు, నైవేద్యాలు, పసుపు, కుంకుమలు సమర్పించి కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేకపూజలు నిర్వహించారు. రాంపూర్‌లో నాగదేవత ఆలయం వద్ద మహిళలు పెద్ద ఎత్తున బారులు తీరారు. నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సారంగాపూర్ : మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం ఘనంగా నాగుల పంచమిని నిర్వహించారు. ఈ నేపథ్యంలో మహిళలు నూతన వస్త్రాలను ధరించి గ్రామాల సమీపంలో గల నాగదేవతల ఆలయాల వద్దకు వెళ్లి మొక్కులను మొక్కి నాగ దేవతలకు పూజలు చేశారు. దీంతో గ్రామాల్లో పండగ సందడి నెలకొంది.

భైంసా, ఆగస్టు 9 : డివిజన్ పరిధిలో శుక్రవారం నాగుల పంచమి వేడులకు భక్తిశ్రద్ధల మధ్య ఆనందోత్సాహాలతో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని బాగుబాయిగుట్ట సాయిబాబా మందిరంలో గల నాగదేవత విగ్రహానికి, మహాలక్ష్మీ జ్యువెల్లరీ మార్కెట్ పరిధిలోని నాగదేవత ఆలయంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమీప ప్రాంతాల్లోని పుట్టలకు పూజలు చేపట్టి అందులో పాలు పోశారు. నాగదేవత ఆలయాల్లో పూజలు నిర్వహించిన అనంతరం మహిళలు తమ తమ సోదరులకు కళ్లను కడిగారు. సోదరిమణులకు సోదరులు కొత్తబట్టలను అందించి కానుకలు సమర్పించారు.నాగపంచమిని పురస్కరించుకొని మహాలక్ష్మీ జ్యువెల్లరీ మార్కెట్ కమిటీ భారీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టింది. పట్టణ సరిహద్దులోని నాందేడ్ మార్గంలో గల నాగదేవత ఆలయం వద్ద పలు సంస్థలు అన్నదాతన, ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టాయి. ఇక్కడి ఆలయంలో దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో బారులు తీరారు. దీంతో భక్తుల దర్శనానికి రెండు గంటలకు పైగా సమయం పట్టింది.

ముథోల్ : నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని చించాల, తరోడా, ఎడ్‌బిడ్, చింతకుంట, ఆష్ట, విట్టోలి, తదితర గ్రామాల్లో శుక్రవారం నాగుల పంచమి వేడుకలను భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా జరుపుకున్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు నాగదేవతలకు కొబ్బరి, బెల్లంతో పాలు పోసి పూజలు నిర్వహించారు. పుట్ట వద్ద, ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అక్క చెల్లులు అన్నదమ్ములకు ఆవు పాలతో కళ్లు కడిగి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా తోబుట్టువులకు సోదరులు కానుకలు సమర్పించారు.

తానూర్ : మండల కేంద్రం తానూర్‌తో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం నాగుల పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టల్లో పాలు పోసి నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. పుట్టింటి ఆడపడుచులు తమ పుట్టింటికి చేరుకొని వారి అన్నయ్యలకు, తమ్ములకు కండ్లను కడిగారు. పలు ఆలయాల వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు.

కుభీర్ : నాగ పంచమిని పురష్కరించుకొని శుక్రవారం మహిళలు పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. మండల కేంద్రం కుభీర్‌తో ఆపటు మండలంలోని ఆయా గ్రామాల్లో గల నాగమ్మ తల్లి ఆలయాల వద్దకు భక్తులు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇండ్లలో తమ అన్నయ్యలకు, తమ్ముళకు కండ్లను కడిగి పండగను జరుపుకున్నారు.

కుంటాల : మండల కేంద్రమైన కుంటాలతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో శుక్రవారం నాగుల పంచమిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఉదయం నుండి స్థానిక పుట్టల వద్దకు వెళ్లి పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 9 : జిల్లాలో ఆదివాసీల అభ్యున్నతికి కృషి చేస్తానని ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రపంచ ఆదివాసీల దినోత్సవం సందర్భంగా శుక్రవారం చైన్‌గేట్ వద్ద గల రాంజీ గోండు, కొమురం భీమ్ విగ్రహాలకు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆదివాసీలకు రోడ్లు, పాఠశాలలు, వైద్య తదితర మౌళిక సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానన్నారు. వేయి ఉరుల మర్రి ప్రాంతాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. ఆదివాసి నాయకులు పాల్గొన్నారు. బీజేపీ నాయకులు కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్మల్‌లోని రాంజీ గోండు, కొమురం భీమ్ విగ్రహాలకు మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆదివాసీల ఆత్మగౌరవ పోరాట వీరులు కొమురం భీమ్, రాంజీ గోండు స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.

పెంబి : మండలంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం వేడుకలను శుక్రవారం ఆదివాసీలు ఘనంగా నిర్వహించారు.


ఆదిలాబాద్‌లో పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు


నేరడిగొండలో పుట్టలో పాలు పోస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ దంపతులు


తాంసిలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు


ఇచ్చోడలో పుట్టలో పాలు పోస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో నాగ పంచమి వేడుకలు

- ఆదిలాబాద్ జిల్లాలో భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

శ్రావణమాస మొదటి శుక్రవారంతో పాటు నాగుల పంచమి తోడవడంతో ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఎటు చూసిన భక్తులు కోలాహలంగా నాగదేవత విగ్రహాలకు పూజలు చేశారు. పుట్టలో పాలు పోసి, తమ మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబాన్ని సల్లంగా చూడాలని నాగ దేవతకు వేడుకున్నారు. పట్టణంలోని డైట్ మైదానం వద్ద పుట్ట వద్దకు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అలాగే, ఆయా మండలాల్లోనూ మహిళలు పుట్టల్లో పాలు పోసి మొక్కులను చెల్లించుకున్నారు.

- న్యూస్ నెట్‌వర్క్

సేవలను సద్వినియోగం చేసుకోవాలి

తలమడుగు, ఆగస్టు 9: తపాలా శాఖ అందిస్తున్న ఇన్సూరెన్స్ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు ముడుపు కేదారేశ్వర్‌రెడ్డి, పోస్టల్ అధికారి తలర్ల రాములు అన్నారు. మండలంలోని బరంపూర్‌లో గ్రామంలో రైతు వేదికలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా చిన్న మొత్తాల పొదుపు ప్రారంభిస్తే భవిష్యత్తు ఎంతో బాగుంటుందని ఆలోచించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తపాల శాఖ అధికారులు సూచించారు. తపాల శాఖ అనేక రకాల సేవలు అందిస్తున్నారు. పోస్టు కార్యాలయాలలో సేవింగ్ అకౌంట్ ఇన్సు రెన్స్ పాలసీ వలన కలిగే లాభాలతో పాటు బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సుకన్య సమృద్ధి ఖాతాల గురించి ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించారు. ఇందులో మాజీ ఎంపీటీసీ రంజిత్‌రెడ్డి, సామ పోతారెడ్డి, ప్రతాప్, మల్లారెడ్డి, నాగారెడ్డి, పంచాయితీ సెక్రెటరీ అనిల్‌రెడ్డి, పోస్టల్ అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

ఇంద్రవెల్లి, ఆగస్టు 9: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అటవీ శాఖ ఎఫ్ఆర్‌వో సంతోష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణం బాగుంటే వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండుతాయన్నారు. మొక్కలు నాటిన వారు వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

సిరికొండ, ఆగస్టు 9: ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిరికొండ ఇన్‌చార్జీ తహసీల్దార్ ఉపేందర్ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం ముగింపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వాయిపేట్, ఫకీర్‌నాయక్ తండా గ్రామాల్లో మొక్కలు నాటి డ్రై డే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. స్వచ్ఛ దనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలని సూచించారు. గ్రామాల్లోని ప్రతీ వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు పెందూర్ గంగాధర్, ముడావి గంగారాం, జాదవ్ లచ్చిరామ్, మాజీ ఎంపీటీసీ మారుతి, అంగన్వాడీ టీచర్ హంసబాయి, వార్డు మెంబర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా మహేష్‌బాబు జన్మదినం

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 9: సూపర్ స్టార్ మహేష్‌బాబు జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదిలాబాద్ పట్టణంలోని ఆయన అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ అభిమాని సెవ్వ జగదీష్ మాట్లాడుతూ తండ్రి కృష్ణ లాగే మహేష్ కూడా సేవా కార్యక్రమాలు చేస్తూ దాదాపు మూడు వేలకు పైగా పేద పిల్లలకు గుండె ఆపరేషన్ చేయించి నిజమైన హీరో అనిపించుకుంటున్నాడని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గండ్రత్ రమేష్, మెట్టు ప్రహ్లాద్, తదితరులు పాల్గొన్నారు.



నాగోబా దర్శనం కోసం క్యూ కట్టిన భక్తజనం

జనంతో కిక్కిరిసిన కేస్లాపూర్

● నాగోబా ఆలయానికి పోటెత్తిన భక్తజనం

ఇంద్రవెల్లి, ఆగస్టు 9: ఆదివాసీల ఆరాధ్య దైవం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన కేస్లాపూర్ నాగోబా ఆలయంలో నాగుల పంచమి పండుగ సందర్భంగా శుక్రవారం నాగోబా ఆలయానికి భక్తులు పోటెత్తారు. భక్తులు భారీగా తరలిరావడంతో జాతరను తలపించింది. ఉదయం నుంచే మండలంతో పాటు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు, మెస్రం వంశీయులు తరలివచ్చి ప్రత్యేక పూజలుచేశారు. మెస్రం వంశీయులు నాగుల పంచమి సందర్భంగా సంప్రదాయ పద్ధతిలో వండిన జొన్న గుట్కాను వారి ఆచారం ప్రకారం మోదుగ ఆకులలో భోజనం చేశారు. ఆలయ పరిసర ప్రాంతంలో దుకాణాలు, రంగుల రాట్నాలు ఏర్పాటు చేయడంతో భక్తులు ఉల్లాసంగా గడిపారు. మొదటి రోజు నాగుల పంచమి పూజలకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో కేస్లాపూర్ నుంచి ముత్నూర్ వరకు ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో నాగోబా పూజకు వచ్చిన భక్తులు కేస్లాపూర్ నుంచి రెండు కిలో మీటర్ల వరకు కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాగుల పంచమి పూజలు శనివారం వరకు కొనసాగుతాయని మెస్రం వంశీయులు తెలిపారు. అలాగే కేస్లాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ సౌజన్యంతో నాగోబా యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆటల పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. నాగోబా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రయాణ ప్రాంగణంలో ప్రత్యేక గది

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 9: ఆదిలాబాద్ ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో శిశువులకు పాలు పట్టడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక గదిని డీఎల్ఎస్ఏ కార్యదర్శి బోనగిరి సౌజన్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి బొనగిరి సౌజన్య మాట్లాడుతూ శ్వాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ గది, బాలింతలు తమ పిల్లలకు పాలు పట్టడానికి ఎంతగానో సౌకర్యంగా ఉంటుందన్నారు. అనంతరం శ్వాస్ సంస్థ అధ్యక్షుడు ప్రణయ్ కారింగుల ప్రణయ్ మాట్లాడుతూ మాతృమూర్తులకు ఇబ్బంది కలుగకుండా ఉండాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ కల్పన, కేమ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా

తలమడుగు, ఆగస్టు 9: జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి ఆ పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి చింతలపల్లి దేవారెడ్డి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో పని చేస్తున్నప్పటికీ తగిన ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. పార్టీ బలో పేతం కోసం సొంత డబ్బులతో ప్రచారం నిర్వహించినప్పటికీ బీఆర్ఎస్ పార్టీలో గుర్తింపు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు.

భట్టాచార్య ఆశయ సాధన కోసం కృషి

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 9: సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు, పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య సంతాప సభను పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని సుందరయ్య భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, సీనియర్ నాయకులు బండి దత్తాత్రిలు భట్టాచార్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్లు లర్పించారు. అనంతరం వారు మాట్లాడారు.



● ఎదుగుదల నిలిచిపోయి కనిపిస్తున్న పత్తి

సాధారణ వర్షపాతమే..



» జిల్లాలో ఇప్పటి వరకు 693.5 మి.మీ.ల వర్షపాతం నమోదు
» 4మండలాల్లో అధికం.. మిగితా మండలాల్లో సాధారణం
» ముసురువర్షాలతో దెబ్బతింటున్న పత్తి, సోయా పంటలు
» పంట ఎదుగుదల నిలిచిపోతోందని అన్నదాతల ఆందోళన

ఆదిలాబాద్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంకా సాధారణ వర్షపాతమే కనిపిస్తోంది. జూలై మాసం గడిచిపోయి ఆగస్టు ప్రారంభమైన భారీ వర్షాల జాడే కనిపించడం లేదు. కురుస్తున్న ముసురు వర్షాలతో పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. జిల్లా సగటు వర్షపాతం 626.3 మి.మీ.లు కాగా, ఇప్పటివరకు 693.5 మి.మీ.ల సాధారణ వర్షపాతం నమోదైంది. ప్రధానంగా చెప్పుకునే సాత్నాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 286.50 మీటర్లు కాగా, ప్రస్తుతం 285.10 మీటర్లకు చేరుకుంది. మత్తడివాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 277.50 మీటర్లు కాగా, 276.80 మీటర్ల వద్ద నీటిమట్టం నిలకడగా కనిపిస్తోంది. ఇప్పటి వరకు ప్రాజెక్టుల గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసిన పరిస్థితి కనిపించడం లేదు. ఈయేడు వానాకాలం సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 5లక్షల 72వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. ఇందులో పత్తి పంటనే 4లక్షలకు పైగా అధికంగా సాగవుతుంది. రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం నమోదయ్యే జిల్లాలో ఎక్కువగా వర్షాధార పంటలనే సాగు చేస్తున్నారు. అయితే కురుస్తున్న ముసురు వర్షాలకు పంట చేలు జౌకు పట్టిపోయి పత్తి, సోయా, కంది పంటలకు తీవ్రనష్టం వాటిల్లే అవకాశం ఉందంటున్నారు. లోతట్టు ప్రాంతాల్లోని పంటలు జౌకు పట్టిపోయి కనిపిస్తుండగా.. ఎగువ ప్రాంతంలోని పంటలకు చీడపీడలు ఆశించడంతో తీవ్రంగా దెబ్బతింటున్నాయి. అడుగు మందులు, రసాయన మందులను పిచికారి చేయడానికి అదును దాటి పోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈయేడు పెట్టుబడులైనా చేతికి వస్తాయో? రావోనన్న ఆందోళన కనిపిస్తోంది. ఇకనైనా వర్షాలు తగ్గుముఖం పడితేనే పంటల ఎదుగుదల ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.



● బజార్‌హత్నూర్ మండంలో జౌకు పట్టి ఎదుగుదల నిలిచిపోయిన పత్తి పంట

సాధారణ వర్షపాతమే కానీ..

ఈయేడు జిల్లాలో సాధారణ వర్షపాతమే నమోదైనా.. ఏకధాటిగా కురుస్తున్న ముసురువర్షాలతో పంటల ఎదుగుదల నిలిచిపోతోందని రైతులు వాపోతున్నారు. 18 మండలాల పరిధిలో గుడిహత్నూర్ 710.2 మి.మీ., ఆదిలాబాద్‌రూరల్ 975.4, ఆదిలాబాద్ అర్బన్ 994.5, తాంసి 773.3 మండలాల్లోనే అధిక వర్షపాతం నమోదైంది. మిగితా 14 మండలాల్లో సాధారణ వర్షపాతం కురిసింది. అత్యల్పంగా నేరడిగొండ మండలంలో 512.1లో మి.మీ.ల వర్షం కురిసింది. ముసురువర్షాలతో కలుపు నివారణకు అసలు అవకాశం లేకపోవడంతో రైతులు ప్రమాదకరమైన రౌండప్ మందులతో కలుపునివారణ చేపడుతున్నారు. ఆగస్టు మొదటి వారం ముగిసిపోతున్నా.. భారీ వర్షాల జాడేలేకుండా పోయింది. దీంతో ప్రాజెక్టుల్లో గరిష్టస్థాయి నీటినిల్వలు కనిపించడం లేదు. ముసురు వర్షాలతో ఆశించినస్థాయిలో ప్రాజెక్టులోకి వరదనీరు రావడం లేదు. దీంతో ఆయకట్టు రైతుల్లో కొంత ఆందోళన వ్యక్తమవుతోంది.

చుట్టుముడుతున్న చీడపీడలు

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురువర్షాలకు పంటలను చీడపీడలు చుట్టుముడుతున్నాయి. అధిక తేమ కారణంగా పత్తి, సోయా, కంది పంటల ఎదుగుదల పూర్తిగా నిలిచిపోతోంది. లోతట్టు ప్రాంతాల్లోని పంట చేలలో వరదనీరు చేరి పత్తి పంట ఎదగడం లేదంటున్నారు. లోతట్టు ప్రాంతాల్లోని పంటలు ఎరుపుబారి పోయి కనిపిస్తున్నాయి. రెండు మాసాలు గడుస్తున్నా.. పంట ఎదుగుదల కనిపించడం లేదు. అలాగే చీడపీడలు ఆశించి వేరు కుళ్లు, పచ్చపురుగు వ్యాధులు ఉధృతమవుతున్నాయి. ముఖ్యంగా పత్తి పంటను ఆశించే గులాబీ రంగు పురుగు ఉధృతికి వాతావరణం అనుకూలంగా మారిందంటూ రైతులు చెబుతున్నారు. చీడపీడల నివారణకు రసాయన మందుల పిచికారికి అవకాశమే లేకుండా పోతోంది. ఎర్రనేలల్లో పంటల పరిస్థితి కొంతమెరుగ్గానే ఉన్నా.. నల్లరేగడి నేలల్లోనే పంటలు జౌవుకు పట్టిపోతున్నాయి. రోజుల తరబడి పంట చేలలో వర్షపునీరు నిలిచి పత్తి, కంది పంటలు ఎండుబారి పోతున్నాయి. ఇలాంటి పరిస్థితులతో ఆశించిన దిగుబడులు కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కంది పంట దెబ్బతింటోంది

: జడల శ్రీనివాస్, రైతు, బజార్‌హత్నూర్ మండలం

కురుస్తున్న ముసురు వర్షాలతో కంది పంట తీవ్రంగా దెబ్బతింటోంది. అధిక తేమతో ఆకు రాలి ఎండుబారి పోతోంది. పత్తి, సోయా పంటలు అధిక తేమతో ఎరుపుబారీ పోతున్నాయి. రసాయన మందులను పిచికారి చేద్దామన్న అవకాశం లేకుండా పోయింది. ఇకనైనా వర్షాలు తగ్గుముఖం పడితేనే సాగు పనులకు అవకాశం ఉంటుంది. ఏం చేద్దామన్న అర్థం కావడం లేదు. కలుపు నివారణకు అవకాశం లేక పంటలను కలుపు మొక్కలు కప్పేస్తున్నాయి. దీంతో పెట్టుబడి ఖర్చులూ పెరిగిపోతున్నాయి. కూలీల కొరతతో కలుపు నివారణ మందులను వాడుకోవాల్సి వస్తుంది.



పంటలను పరిశీలిస్తూ ఉండాలి..

: శ్రీధర్‌చౌహాన్, సీనియర్ శాస్త్రవేత్త, ఆదిలాబాద్

రైతులు పంటలను నిత్యం పరిశీలిస్తూ అవసరమైన సస్యరక్షణ చర్యలను తీసుకోవాలి. పంట చేలలో వర్షపునీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అధికారుల సలహాలు, సూచనల మేరకు రసాయన మందులను పిచికారి చేసుకోవాలి. అధికతేమతో వేరుకుళ్లు తెగులు వ్యాప్తి చెందే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం ఎదుగుదశలో ఉన్న పత్తి, సోయా పంటలకు అధిక వర్షాలు కొంత నష్టాన్ని కలిగించే అవకాశం ఉంటుంది. చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. ఇప్పుడిప్పుడే వర్షాలు తగ్గుముఖం పడుతున్నాయి. వెంటనే అవసరమైన ఎరువులను వేసుకుంటే మంచిది.

ఏజెన్సీలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.60కోట్లు

● జిల్లా కలెక్టర్ రాజార్షిషా ● కొమురం భీం ప్రాంగణంలో ఘణంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో పాల్గొన్న జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆదివాసీలు

ఉట్నూర్, ఆగస్టు 9: ప్రతియేటా వేసవి కాలంలో ఏర్పడుతున్న ఏజెన్సీ గ్రామాల్లోని మంచినీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం రూ.60 కోట్లు మంజూరు చేసిందని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షిసా అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకుముందు కొమురంభీం ప్రాంగణంలో ఉన్న కొమురంభీం విగ్రహానికి ఎస్పీ గౌస్‌ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావుపాటిల్‌లతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం పీఎంఆర్సీ భవనంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. కెరమెరి మండలం ధనోరా ప్రాంతంలో నిర్మించిన ఇంటెక్‌వెల్ ద్వారా ఏజెన్సీలోని ఉట్నూర్ ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ, సిరికొండ, తదితర ఏడు మండలాలకు మంచినీటి ఎద్దడి తీర్చడానికి ఈ ప్రాంతంలోని రూ.60కోట్లతో ప్రభుత్వం ఇంటెక్‌వెల్ మంజూరు చేసిందని, టెండర్లు కూడా పూర్తి అయ్యాయని త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. మంచినీటి ఎద్దడి శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రభుత్వం ఐటీడీఏకు పూర్వ వైభవం ఇవ్వడానికి కావాల్సినన్ని నిధులు మంజూరు చేయడానికి ముందుకు వస్తుందని గతంలో లాగానే ఐటీడీఏ ద్వారా గిరిజనులందరికీ.. అన్నిరకాల సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. ఇప్పటికే గిరిజన ప్రాంతాలలో ఉన్న రోడ్ల సమస్యను, సాగునీటి సమస్యను, మంచినీటి సమస్యను పరిష్కరించడానికి అన్ని శాఖల ద్వారా సమావేశాలు నిర్వహించి నివేదిక తయారు చేస్తున్నామన్నారు. నిరుద్యోగుల కోసం ప్రత్యేక డీఎస్సీ పెట్టాలని గిరిజనుల కోరికను ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా అన్ని పాఠశాలలకు మరమ్మతులు చేయడం జరిగిందని, స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా గత వేసవిలో బోర్లు వేయడంతో పాటు బోర్లు పడని చోటికి తాగునీటి రవాణా చేయడం జరిగిందన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న అనుమతుల కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో ప్రభుత్వం నుంచి మరికొన్ని రోడ్లు మంజూరు కానున్నాయని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాలలో రక్తహీనత అధికంగా గర్భిణులలో కనిపిస్తోందని దీన్ని పరిష్కారం కోసం గిరిజనులందరు ఆకుకూరలు కాయగూరలు భుజించడంతో పాటు పౌష్టిక ఆహారం భుజించాలని, తద్వారా చిన్న పిల్లలకు సైతం ఇంటి వద్దనే కూరగాయలు తినడం అలవాటు పడుతుందని అన్నారు. ఆశ్రమ పాఠశాలలో పిల్లలకు కూరగాయలువండి పెడితే సరిగ్గా తినడం లేదన్నారు. జిల్లాలోని ఆదివాసీ గిరిజనుల సంస్కృతీ, సంప్రదాయాలు బాగా ఉన్నాయని ప్రశంసించారు. అంతకు ముందే ముఖ్య అతిథిగా సమావేశానికి హాజరైన ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ హైదరబాద్‌లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం కార్యక్రమం పెద్దఎత్తున ఉందని అక్కడ మేధావులకు, ప్రజాప్రతినిధులకు గిరిజనుల సమస్యలు తెలిపే అవకాశం ఉంటుందని పేర్కొంటూ ముందుగా మాట్లాడారు. ఆదివాసీల సంస్కృతీ, సాంప్రదాయాలు గొప్పవని అన్నారు. ముందుగా ఎమ్మెల్యే కార్యాలయం నుంచి కేబీ కాంప్లెక్స్ పీఎంఆర్సీ భవనం వరకు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మహనీయులు చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. ఇందులో ఎస్పీ గౌస్‌ఆలం, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త, జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్‌బాజీరావు, ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యనిర్వహణ కమిటీ చైర్మన్ మంగం విషం రావు, జిల్లా సార్‌మేడిలు, పటేళ్లు, ఆదివాసీ సంఘాల నాయకులు పురకబాపురావు, మాజీ ఎంపీపీ జైవంత్‌రావు, మరసుకోల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.




ఉట్నూర్‌లో ఆదివాసీల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే



భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న జిల్లా అధికారులు



జిల్లాకేంద్రంలో పాల్గొన్న ఆదివాసీ సంఘాల నాయకులు



కుంటాలలో ఆదివాసీ మహిళను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

జిల్లావ్యాప్తంగా.. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్ర వారం ఆదివాసీలు ఘనంగా జరుపుకున్నారు. దీనిలో భాగంగా హిరాసుఖ జాగృతి సమితి ఆధ్వర్యంలో బస్టాండ్ ఎదుట నిర్వహించిన వేడుకల్లో ఎస్పీ గౌస్‌ఆలంతో కలిసి పాల్గొన్నారు. ముందుగా హిరాసుఖ దేవున్ని పూజలు చేశారు. అనంతరం జెండాను ఆవిష్కరించి భీం,రాంజీగోండు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే నేరడిగొండ, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, తలమడుగు, బోథ్, జైనథ్, తాంసి, గుడిహత్నూర్‌తో ఆయా మండలాల్లో ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేకదృష్టి సారించాలి

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 9: ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేకదృష్టి సారించాలని స్వచ్ఛదనం పచ్చదనం ప్రత్యేక అధికారి, మెంబర్ సెక్రెటరీ టీజీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జి.రవి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో, మున్సిపాలిటీలలో చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థాయిలో ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి గ్రామాలను పరిశుభ్రతతో పాటు, సీజనల్ వ్యాధులపై ప్రత్యేకదృష్టి సారించాలని సూచించారు. గ్రామ స్థాయిలో శానిటేషన్ పక్కాగా నిర్వహించి, అంతర్గత రోడ్ల అభివృద్ధి గ్రామాలలో ప్రతీ ఇంటికి స్వచ్ఛతతో పాటు పచ్చదనం ఉండే విధంగా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఉట్నూర్: మండలంలోని లక్కారం గ్రామ పంచాయతీలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా అవెన్యూప్లాంటేషన్ మొక్కలను నాటే విధానాన్ని కలెక్టర్ రాజార్షిషా శుక్రవారం పరిశీలించారు.

గుడిహత్నూర్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఇంద్రవెల్లిలో ఆదివాసీ గిరిజన అమరవీరుల స్మృతి వనం పనులు పరిశీలించి ఆదిలాబాద్ వెళుతున్న క్రమంలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని తోషం బాలుర గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ మొక్కలను నాటారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీవో సాయన్న, మండల అధికారులు ఉన్నారు.


● స్మృతి వనం పనులు వేగవంతం

ఇంద్రవెల్లి: అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఆదివాసీ గిరిజన అమరవీరుల స్మృతి వనం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదివాసీ గిరిజన అమరవీరుల స్మృతి వనం పనులను పరిశీలించారు.

భారీగా రేషన్ బియ్యం పట్టివేత

● ఈశ్వర్‌నగర్ వద్ద విజిలెన్స్ తనిఖీలు ● 149 బస్తాల పీడీఎస్ బియ్యం స్వాధీనం

ఇంద్రవెల్లి, ఆగస్టు 9: భారీగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లోడ్‌తో వెళుతున్న రెండు బోలేరా వ్యాన్‌లను సివిల్ సప్లయ్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు పట్టుకున్నారు. పేదలకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారనే సమాచారం మేరకు విజిలెన్స్ అధికారులు శుక్రవారం మండలంలోని ఈశ్వర్‌నగర్ గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రెండు వ్యాన్‌లో 149 బస్తాల బియ్యం ఉన్నట్లు గుర్తించి సుమారు 78 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. అలాగే, బోలేరా వ్యాన్‌లను స్వాధీనం చేసుకుని కడెం మండలంలోని బెల్లాల్ గ్రామానికి చెందిన జలపతి అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. పట్టుబడిన 149 బస్తాల బియ్యాన్ని మండల కేంద్రంలోని స్థానిక రేషన్ షాప్‌కు తరలించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఓఎస్డీ శ్రీధర్‌రెడ్డి, సీఐ లక్ష్మయ్య, ఎస్సై శ్రీనివాసరావు, ఏఎస్‌వో సుదర్శన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పీడీఎస్ బియ్యం పట్టుకున్న అధికారులు